


# ప్రసన్నమా? కరుణా

రచన

అవసరాల రామకృష్ణారావు

మడతమంచంమీద వెల్లకిలా పడుకుని ఉన్నాడు బుచ్చి. కుడివైపు పేంటు జేబులో నిండివున్న వేరుసెనగ పలుకుల్ని ఒకటీ ఒకటీ ఎగరేసుకుని నోటితో అందుకుంటున్నాడు. ఎంతోకాలం-ఎండాకాలం గడిచిన తర్వాత చిటపట చినుకులు పడుతూవుంటే చెయ్యి జాచి చూస్తారు కొందరు. కాని నాలిక జాచి వానచినుకుల రుచి చూస్తాడు బుచ్చి. వేరుసెనగ పలుకులు ఒకటీ ఒకటీ నోటిలో పడుతూ ఉంటే అలాంటి ఆనందమే అనుభవిస్తాడు వాడు.

## 2

'చూడు! చేసినవన్నీ చేసేసి ఏమీ ఎరగనట్టు దొంగవెధవ ఆ నిశ్చింత చూడు!' సుబ్బారావుగారు కొడుకుమీద ఎగిరి పడ్డాడు.

'ఊరుకుందురూ - మీరు మరీని! ఇది పెళ్ళివారిళ్లు అన్న సంగతి మరచిపోకండి. నలుగురూ వింటే నవ్వగలరు. ఇంటికి వెళ్లగానే కావలిస్తే మన పురాణం విప్పుకోవచ్చు,' అంది అనూరాధ.

'నువ్వు అలాగే వాణ్ని వెనకేసుకొస్తూ వుంటే యిక బాగుపడ్డట్టే... శుభమా అని మనం ఎందుకిక్కడికి వచ్చాం - నలుగుర్నీ కంట తడి పెట్టించడానికా? ఆ మాత్రం జ్ఞానం ఉండొద్దూ? ముహూర్తానికి వీడు లేకపోతే ఎవరూ బెంగపెట్టుకుని మంచాలు ఎక్కరు. ఇంకో అరగంటకి రైలుంది దయచెయ్యమను.'

'ఏమిటి బావా వాణ్ని అలా సతాయిస్తున్నావ్?' అని అడిగాడు అనూరాధ రెండోతమ్ముడు ప్రకాశం.

'నీకు తెలియదనే అడుగుతున్నావా ఏమిటి? కార్టూన్లు వెయ్యడం ఒక కళే - ఒప్పుకుంటాను. కాని మన బతుకే కార్టూను చేసుకుంటామా? ఈ తెలివితేటలు చదువులో చూపించకూడదూ!'

'నేను కనుక్కుంటానుగాని, నువ్వు వెళ్ళు' అన్నాడు ప్రకాశం.

సుబ్బారావుగారు హడావిడిగా అక్కణ్ణుంచి వెళ్ళిపోయారు.

ప్రకాశం బుచ్చి భుజంమీద ప్రేమగా చెయ్యివేసి -

'మళ్ళీ ఎవరో ఒకరు గదిలోకి వచ్చేస్తారు. నీతో రెండు ముక్కలు చెబుదామనుకుంటున్నాన్రా బుచ్చీ!' అన్నాడు.

అంతవరకూ బుచ్చి అరగంట శ్రమపడి గీసిన చిన్నమామయ్య 'గీతమీసం' వరిఉంచడంలో నిమగ్నుడయి ఉన్నాడు. కాని ఆ మాటలలో ఆత్మీత పోల్చుకుని - మనస్సుని అరికట్టుకుని - కళ్ళు కిందకి దించుకు 'చెప్పు మావయ్యా!' అన్నాడు.

'ఏం చెప్పను, ఎన్నిసార్లని చెప్పను! చిన్నప్పుడు నాచేత 'రాజూ-ఏడు చేపలూ కథ' చెప్పించుకునేవాడివి. ఇప్పుడూ అదే స్థితిలో ఉన్నావు. నాకు బాగా జ్ఞాపకం. రోజుకి కనీసం రెండుమూడుసార్లయినా బోడిముండ వేషం వేస్తేగాని నీకు తోచేది కాదప్పుడు. పది పదిహేనుసార్లయినా కుక్క అరుపులూ, పిల్లి అరుపులూ అరిస్తే

గాని తోచేదికాదు నీకు. బియ్యే చదువుతున్నావు యిప్పుడు. అయితే ఏంలాభం!

పక్కకి ఒత్తిగిల్లి బీరువా అద్దంలో చూసుకున్నాడు బుచ్చి. గెడ్డం మాసి ఉంది. తల రేగిఉంది. బట్టలు నలిగి ఉన్నాయి. 'పెళ్ళివారింటికి వచ్చి వేసుకోవలసిన డ్రెస్సు యిదేనా అని నిన్ను నిలదియ్యడానికి రాలేదు సుమీ నేను! అలాంటివి ఎప్పటికేనా నువ్వు చూసుకోగలవు. నీది చాలా మంచి మనసు. నాకు తెలుసు. కాని, ఒకర్ని హేళన చేసి చిన్నబుచ్చినంత మాత్రాన మన కేం కలిసిరాదు. అది నువ్వు ఎంత త్వరగా తెలుసుకుంటే నేనంత సంతోషిస్తాను. జీవితాన్ని లైట్ గా తీసుకోడం మంచిదే. కాని సీరియస్ నెస్ లేకపోతే అందులోని ఔచిత్యం అందదు. ఏవో బట్టలు తేవాలిట, అలా బజారుకెడదాం వస్తావా?'

'నాకింకా ఆలస్య ముంది... నువ్వు వెళ్ళిరా మావయ్యా!'

'సరే... నే చెప్పింది కొంచెం ఆలోచించు' అంటూ ప్రకాశం బుచ్చిని అయోమయంలో పడేసి వెళ్ళిపోయాడు. తనకంటె ఆరేళ్ళు పెద్దయితేఏంగాక, మనస్సు విప్పి చెప్పుకునే ప్రాణస్నేహితుడిలా ఉంటాడు ప్రకాశంమామయ్య. జోక్ జోడించితప్ప మాట విసరని మావయ్య ఎంతో బాధపడితే గాని అలా మాట్లాడి ఉండడు. తనవల్ల ఏం తప్పు జరిగిందో!

తనకి బావ వరస అయిన శివరాం పెళ్ళికి ఎంతమాత్రం రావొద్దని బుచ్చి తల్లీ తండ్రీ చెల్లెలూ రాసిపడేశారు.

'డబ్బున్నవాళ్ళమని వాళ్ళకు గర్వాలు ఎక్కువ... నీ ఎడ్రసు ఇచ్చామనుకో.. బహుశా నీకు శుభలేఖ పంపివుండరు. తొందరపడి రాకు'...శుభలేఖ రానిమాట నిజమే, అయినా శివరాంబావ పెళ్ళికి ఒకరు తన్ను పిల్చే దేమిటి!...

'పరీక్షలని రాశావు... బయల్దేరేవు సుమీ.'

...ఆఁ, దిక్కుమాలిన పరీక్ష ల్లేద్దూ... నువ్వు ఏ ఏ పరీక్షలు పాసయ్యావని ఇంత ఉద్యోగం వెలిగిస్తున్నావ్ నాన్నా!... వెధవ పరీక్షలు వస్తాయి, పోతాయి... ఇంతమందిని ఒకేసారి కలుసుకోడం మళ్ళీ మళ్ళీ జరుగుతుందా?...

'నువ్వుగాని వస్తున్నట్టు తెలిస్తే సుందరమ్మత్త కూతురు చిట్టిపిల్ల చక్కా వస్తుంది. దాని వగలూ వయ్యారాలూ భరించడం మాత్రం నావల్ల కాదుసుమీ, అన్నయ్యోయి!'

... ఇంకేం, చిట్టిపిల్ల కనక వస్తే హాస్యాని కేంలోటు!... వెంటనే ఎక్స్‌ప్రెస్ ఎక్కేశాడు బుచ్చి...

సుబ్బరావుగారి రెండోచెల్లెలు సుందరమ్మ – చచ్చి నరకాన్న ఉండివుంటుందని అనూరాధ అభిప్రాయం. సుందరమ్మ మొగుడు సూర్యనారాయణ వయసున్నవంటముండలికి మందు లిప్పించలేక మళ్ళీ పెళ్ళి చేసుకోక తప్పలేదు. చిట్టిపిల్లని


**PEOPLE WHO MATTER INSIST ON**




*Why ? They know that*

The Rabindra proved itself an efficient and Robust fabrication giving safety for their valuables.

దృఢమైన, మన్నికైన, పేరుపొందిన స్టీల్ రోలింగ్ షట్టర్సునే వాడండి.

తయారుచేయువారు :

రబీంద్రనాథ్ సింగ్ అండ్ కో.

ప్రకాశం రోడ్డు :: విజయవాడ

PHONE : 3707. GRAMS "SEEYAR SINGH"

GEMINI

సవిత్తల్లి నూతిచప్టా నిండిపోయేటన్ని అంట్లగిన్నెలు తోమించడం వగైరా ఏమీ చెయ్యలేదు గాని, దాన్ని తన కూతురిగా అంగీకరించలేదు. ఎంతమంది తిన్నా తరగని ఆస్తి కాబట్టి చిట్టిపిల్లకి డబ్బువిషయంలో మాత్రమూ ఎలాంటి అన్యాయమూ జరగలేదు. 'అది కూడా నా కూతురు' అని జ్ఞాపకం వచ్చినప్పుడల్లా 'దీని కూక్కడా పెళ్ళి చెయ్యాలి కాబోలు కర్మ' అనిపిస్తూ ఉంటుంది కన్నతండ్రికి. దీన్ని బుచ్చికిస్తే బాగుణ్ణని అనేకమందిచేత సుబ్బారావుకి చెప్పించాడు సూర్యనారాయణ. అత్తగారివైపు సంబంధం కాబట్టి 'ఎదురు మేనరికం, ఎంత మాత్రం వల్లకాదు' అనేసింది అనూరాధ. ఎవరేమన్నా, ఏ యే ప్రయత్నాలు విఫలమయినా మానినా, చిట్టిపిల్లకి మాత్రం బుచ్చిబావమీద వర్ణించలేనంత గొప్ప అభిప్రాయం ఏనాడో ఏర్పడిపోయింది. కాబట్టి బుచ్చి, పెళ్ళికి వచ్చాడని తెలిస్తే, అది ఎలాగో అలా తండ్రిని ఒప్పించి పెళ్ళికి రాక తప్పదు. సూర్యనారాయణ మావకి ఓ కార్డు రాసిపడేసి రైలెక్కేడు బుచ్చి. 'దాని పేరు, దాని రూపం, దాని వేషం ఏది తల్చుకున్నా నవ్వాగదు. గొప్ప ఎంజాయిమెంటు – ఎందుకు కాలదన్నాలి!' అనుకున్నాడు వాడు. అంతట్లో ప్రకాశంమావయ్య లెక్చెరు జ్ఞాపకానికి వచ్చి మడతమంచంమీంచి లేచి కూర్చుని జరిగిన సంఘటనలు ఒకటీ ఒకటీ జ్ఞాపకం తెచ్చుకోసాగేడు బుచ్చి.

## 3

పెళ్ళికొడుకు శివరాంకి అట్టే పెద్ద వయసులేదు. కాని పెళ్ళికూతురు బొత్తిగా నల్లికిళ్ళ పాములా ఉండడంచేత తన వయసు ఎక్కడ నలుగురూ పెద్దదనుకునిపోతారో అని అతనికి విపరీతమైన ఆందోళన. పైగా పిత్రార్జితం – యీ మధ్య బట్టతల ఒకటి బయటపడింది. అది దాచాలని చాలావిధాల ప్రయత్నించేవాడతను. ఎప్పుడూ టోపీ ఒకటి ధరించేవాడు. పెళ్ళికొడుకుని చేసిననాడు నలుగురూ అక్షింతలు వేసే టైములో టోపీ ఒకసారి తొలిగించక తప్పిందికాదు.

'చుట్టూ అడవి. మధ్యని నున్నని నుయ్యి. నూతిలో నూనె. ఎక్కడుంటుంది చెప్పండి?' అని బుచ్చి పిల్లలికి పొడుపుకథ వేసి, 'అదిగదిగో, టోపీ తీస్తున్నాడు. చూద్దాం పదండి,' అన్నాడు.

తీయబోతున్న టోపీ శివరాం పెట్టేసుకుని ధుమధుమలాడిపోయాడు. బుచ్చి వ్యాఖ్యా, శివరాం కోపమూ చూసి పిల్లలే కాదు, పెద్దలూ గొల్లుమన్నారు. దాన్తో మంగళహారతి యివ్వకుండానే పెళ్లికొడుకు లేచిపోయి గదిలోకి వెళ్ళి, తలుపేసుకున్నాడు! 'ఈ సంఘటనేనా చిన్నమావయ్యని నొప్పించింది!' అని ప్రశ్నించుకున్నాడు బుచ్చి.

వెధవ ప్రపంచం – ఎందుకో ఎప్పుడూ ఏదో తల్చుకుని కుమిలిపోతూ ఉంటుంది.


**R. K. INDUSTRIES**

HIGH ROAD, VELACHERY, MADRAS-42, Grams: "ARTHENE"

*Offers:*

**POLYTHYLENE**
**LAY FLAT TUBES,**
**SHEETS, BAGS Etc.**

*Proprietors:*

**K. ORR & COMPANY**

16, STRINGERS' STREET, MADRAS-1

Phone : 23019 & 23526 Grams: "PRESUNDRY"

*Agents & Stockists:*

PAPER, PRINTING INKS (COATES) & OTHER PRINTERS' SUNDRIES AND INSTA NUMBERING — MACHINES —

*Indents booked for:*

PAPER, PROCESS ZINC & COPPER SHEETS, LITHO-GRAPHIC ZINC SHEETS, HARDWARE, MATCH CHEMICALS "KG" ZIP — FASTENERS ETC. —

దాని కప్పుడప్పుడు కితకితలు పెట్టడం తప్పా?

చిన్నపిన్ని ఉడుక్కుందని కోపం వచ్చిందేమో ఒకవేళ?

చిన్నపిన్నికి పుట్టక పుట్టక కూతురు ఒకతె పుట్టింది. చాలా వికారంగా ఉంటుంది ఆ పాపాయి స్వరూపం. సబ్ కలెక్టరు భార్య గనక చిన్నపిన్ని తన కూతురికి విలువైన నగలూ, ఖరీదయిన బట్టలూ వేసి అనాకారితనాన్ని కప్పెట్టడానికి ప్రయత్నం చేస్తూ ఉండొచ్చు. తల్లి పేరు మరీ బాగానే ఉంది. కాని ఆ కుర్రదాని అద్వితీయ సౌందర్యం నలుగురి దగ్గిరా పొగుడుతూంటే విని సహించడం మాత్రం ఇంచుక ఇబ్బంది అని బుచ్చి నమ్మకం. ఆవిడ హోదా చూసి చుట్టూ చేరినవాళ్ళు భరించగలరేమో గాని అందర్నీ ఆమోదించమని నిర్బంధించడం న్యాయమా?

'మా రతీదేవి కళ్లు చూడండి – ప్రత్యేకించి ఎంత బాగుంటాయో! చాలా విశాలమయిన కళ్లు కవూ అవి?' అంది చిన్నపిన్ని.


'రతి కళ్ళకు ప్రత్యేకత ఉన్నమాట నిజమే' అన్నాడు అక్కడున్న బుచ్చి. ఆ మాటకు చిన్నపిన్ని మురిసిపోయింది.

'చూశారా, నేనంటే కొట్టిపారేస్తారు. బుచ్చిని నేను అనమన్నానా? నలుగురికీ తెలిసేటట్టు చెప్పు బాబూ! మా రతీదేవి కళ్ళలో ఏం ప్రత్యేకత కనిపించింది నీకూ?'

'చెప్పవయ్యా చెప్పు' అంటూ అమ్మలక్క లందరూ చుట్టూ చేరేరు.

'తపస్సు చేసినా యోగులకు సైతం అలవడని సమదృష్టి నీ కూతురికి చిన్నతనంలోనే అలవడింది చిన్నపిన్నీ! అది అటువైపూ యిటువైపూ ఒకేసారి చూడగలదు. ఈ చివరికీ ఆ చివరికీ ఒకేసారి చేరిన దాని నల్లగుడ్లు చూడు!'

రతీదేవి మెల్లకంటిని బుచ్చి వర్ణించిన



తీరు పోల్చుకుని అమ్మలక్క లందరూ పమిటచెంగులకి మూతులు చాటుచేసుకున్నారు, ఆపూట ఎందరొచ్చి ఎన్ని విధాల బతిమాలినా చిన్నపిన్ని భోజనానికి రాలేదు!

ప్రకాశం మావయ్య సూచించింది ఇదేనా?

అన్నట్టు భోగారావుబాబాయి తలకి రంగేసుకోడం మాట?

అవాళ ఎండగా ఉంటే పెరట్లో దూరంగా ఉన్న నూతిదగ్గిర మొహం కడుక్కుందామని వెళ్ళేడు బుచ్చి. పక్కనున్న సామానుకొట్టులోంచి కూనిరాగం ఏదో కొట్టుకొస్తున్నట్టు తోచి అందులోకి తొంగి చూశాడు. భోగారావుగారి కుటుంబంలో పదకొండేళ్ళ రమణ మొదలు ఏభై ఏళ్ళ బాబాయి వరకు వయోభేదం లేకుండా అందరికీ తలలు నెరిసిపోయాయి! నెల మొదటివారంలో సామాన్లు తెచ్చుకునేటప్పుడు అయిదు కేజీల కందిపప్పు అంటూ రాసుకునే లిస్టులో ఏది ఉన్నా లేకపోయినా ఒక డజను మార్నింగ్ స్టార్ (తలకు నల్లరంగు వేసుకునే) సీసాలు తప్పవని బుచ్చి ఆనోటా యీనోటా విన్నాడు. ఈనాడు స్వయంగా చూస్తున్నాడు. పెద్దఅద్దం ముందు పెట్టుకుని 'తననా తనానననా' అని రాగం తీస్తూ భోగారావుగారు తలకు రంగేసుకుంటున్నారు. 'ఓయి, అసాధ్యుడవోయి... బాగా ఎండగా ఉందని, ఈ వేళకి ఎవరూ యిటువైపు రారని యిక్కడ అఘోరించాను. కనిపెట్టేశావూ?' అన్నాడు ఆయన నవ్వుతూ. బుచ్చి వెళ్ళిపోబోతూంటే —

'పోతావేం, రా, రా... ఎలాగా వచ్చావు ... చూడూ ... నువ్వు ఆర్టిస్టువి కూడాను. అటూ యిటూ చూసి సరిగ్గా చెప్పు. దిక్కుమాలిన అద్దం అరసెకనుపాటు తేరిపారి చూస్తే చాలు బతికున్నాళ్ళూ నిలిచిపోయే తలనొప్పి తెప్పించే సామర్థ్యంగలది. చెప్పు, రంగు యూనిఫారంగా పట్టిందా? ఆ చెంపా యీ చెంపా సరిగ్గా కలిసిందా?'

బుచ్చి పకపక నవ్వేడు. ఒకవైపు రంగు పడనేలేదు; రెండోచెంప బుగ్గమీద కూడా రంగే!

'ఏమిటయ్యా ఆ నవ్వూ? ఎలాఉంది?'

'మీరేమీ అనుకోనంటే చెబుతాను' అన్నాడు బుచ్చి.

'అనుకోడమెందుకూ. చెప్పు చెప్పు,' అన్నాడు భోగారావుగారు.

'ఇది చూస్తూంటే చిన్న తమాషా గుర్తుకొస్తోంది నాకు — మీకు కోపమొస్తుందో ఏమిటో ఆ సంగతి వింటే.'

'చెప్పవయ్యా చంపక. ఇంకా స్నానం అదీ చెయ్యాలి, సాదా...'

బుచ్చి మధ్య మధ్య నవ్వు ఆపుకుంటూ ఆ సంఘటన చెప్పుకొచ్చాడు.

'ఆమధ్య మా కాలేజీలో అనన్యసుందరి అనే నాటకం వేశాం. అందులో అమ్మాయి వేషం వెయ్యడానికి ఒక తెల్లని చక్కని పన్నెండేళ్ళ కుర్రాణ్ని సెలక్టు చేశాం. వాడిది కీచుగొంతుక. పైగా మొకొక్క ఏమిటో ఆడపిల్లలు చూసి అసూయ పడే ఎంత తలకట్టు ఉంది వెధవదగ్గిర. చక్కని కనుబొమలూ, సన్నని మధ్యపాపిడీ వాడూను ఇంకేం – జాకెట్టూ చీరా కడితే చూసిన మొగముండాకొడుకులకి మరీ జన్మలో నిద్రపట్టదు–అనుకున్నాం అంతా. కుర్రాడేమో ఒళ్ళూ పయీ తెలీకుండా యాక్టు చేశాడు. అదే కొంపముంచిం దనుకుంటాను – నానా అల్లరై పోయింది.'

'ఏం, ఏంజరిగింది?' అని ఆతృతతో యివతలి కొచ్చేశాడు భోగారావుగారు.

'మీరు ఆ రంగుమీద మందికంట పడటం అట్టే మంచిది కాదు. కొట్టులోకి తమా యించండి, చెబుతాను.

'అవునవును మరిచేపోయాను,' అని ఆయన లోపలికి సర్దుకున్నాడు.

'డిటెయిల్డుగా చెప్పక తప్పదు–వినండి మరి బాగా టైట్ గావున్న లోనెక్ బనీను ఒకటి కట్టి, దానిలోపల రెండు టెన్నిస్ బాల్సు అమర్చి, పైన మంచి జాకెట్టు ఒకటి వేసి, చీర కట్టేశామండీ! భోగా రావుగారి కళ్ళు మిలమిల మెరిశాయి, ఎక్సైటిట్ మెంటుతో.

'చాలా నేచురల్ గా ఉండిఉండాలే!'

'ఉండవలసిందే మరి – కాని డైరక్షన్ కొంచెం మితిమీరడంవల్ల అంతగొడవా జరిగింది అనుకుంటాను. డైరెక్టరుగారు చెప్పేరు కదా: 'అసలు నాటకమంతా హీరోయిన్ బ్యూటీ మీద ఆధారపడి ఉంది నువ్వు ఎంత అందంగా కనిపించినా వగలు కురిపించందే ఎఫెక్టు్స తీసుకు రాలేం.' అని పదేపదే ఆ అబ్బాయికి నొక్కి చెప్పేరు. వయ్యారము ఒలక బొయ్యడం అంటే శరీరం వీలయినంత కదపడం కాబోలు అని ఆ అబ్బాయి అను కుని అక్షరాలా ఆచరణలో పెట్టేడు. దాంతో ఏమయిందో తెలుసా? నాటకానికి ఆయువుపట్టయిన ఒకానొక ప్రేమ సీనులో అబ్బాయి మితిమీరి ఒళ్ళు విరుచుకోడంతో ఒకవైపు టెన్నిస్ బాలు ఎడమవైపు మెడ దగ్గిరకీ, రెండవది కుడికాలి మోకాలు దగ్గిరకీ చేరుకున్నాయి! అది గుర్తించి ప్రేక్షకులే కాక రంగంమీద మిగతా నటులు కూడా గొల్లుమన్నారు... ఇందాక మీరు అడిగారు చూశారా, హెచ్చుతగ్గు లేకుండా, ఆ చెంపా యీ చెంపా రంగు సరిగ్గా కలిసిందా అని... నాకా దృశ్యమే జ్ఞాపకం వచ్చి నవ్వు ఆగలేదండీ బాబాయిగారూ!'

చూస్తూండగా భోగారావుగారి ముఖం ఎర్రబడిపోయింది.


అమోఘమైన చికిత్స

## జమ్మివారి లివర్‌క్యూర్

పసిబిడ్డల లివర్, స్ప్లీన్ వ్యాధులకు పరమౌషధము

వ్యాధి లక్షణాలను ఆదిలోనే గుర్తించండి:

ఆకలి మందగించటం – అజీర్ణం – చిరాకుగా ఏడుస్తూండటం – కొంచెంగా జ్వరం – పొట్ట పెరగటం – మట్టిరంగుగా లేదా తెల్లగా విరేచనం.



జమ్మివారి డాక్టర్లు ముఖ్యమైన పట్టణాలకు ప్రతి నెలా వస్తారు.
వివరాలకు వ్రాయండి:

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్

హెడ్ ఆఫీసు: మద్రాసు-4.

బ్రాంచీలు: బొంబాయి-4 — బెంగుళూరు-2 — కలకత్తా-7 — ఢిల్లీ-6 — కుంభకోణం — లక్నో-1 — నాగపూరు-1 — పాట్నా-4 — తిరుచిరాపల్లి-2 — విజయవాడ-3 — విజయనగరం.

JV-11ATE

'నీకు బుద్ధొచ్చిందని మీ అమ్మ చెబితే నిజమే అనుకున్నాను నీకూ నాకూ యీ జన్మకి బుద్ధి వచ్చేదేమిటి? పుట్టెడు కర్రలు మనవి కాదనుకున్నప్పుడే...ఊఁ, బాగుంది వరస. వెళ్ళి మీ పిన్ని ఎక్కడుందో చూసి తొందరగా రమ్మన్నానని చెప్పు.'

ఆ రాత్రే నాన్న దెబ్బలాడేరు 'ఏమిట్రా, భోగారావుకు ఏదోబూతుకథకూడా చెప్పేవుట. బాగుందే నీ వరసా? నేనేదో నీతో చెప్పి నీ చేత యిన్సల్టు చేయించినట్టు నా మీద ఎగురుతాడేం? నీవల్ల ఎన్ని పాట్లు వచ్చాయిరా బాబూ! అస లేం జరిగిందీ?'

బుచ్చి చెప్పలేదు. ఏదో చెప్పి తప్పించుకున్నాడు. అయినా అంత పెద్దవాడికి ఆ ఉడుకుబోతుతనం బాగుందీ? ప్రకాశం మావయ్యనే అడిగెయ్యవలసింది. ఈసారి కనపడనీ అనుకున్నాడు బుచ్చి. అంత సేపూ మరచిపోయినందుకు నొచ్చుకుని జేబులోని వేరుశెనగపలుకులు మళ్ళీ ఎగరేసి నోటితో అందుకోడం మొదలు పెట్టేడు.

## 4

ఎంత అశ్రద్ధగా పెంచితే ఏంగాని, కూతుర్ని శివరాం పెళ్ళికి పంపడం సూర్యనారాయణకి ఎంతమాత్రం యిష్టంలేదు. అయితే బుచ్చిబావ వస్తున్నాడనే కబురు చిట్టిపిల్లనుంచి దాచడం అంత సుళువు అవలేదు. ఆ కబురు తెలిసీ తెలియగానే యింక రెండో కంటివాణ్ణి అడక్కుండా, అది రెండు పెట్టెల బట్టలు సర్దేసుకుంది. 'పోనీ వెళ్ళి ఆ ముచ్చటేదో అనుభవించి రానిద్దురూ - మన కేం పోయింది మధ్య?' అని సవత్తల్లి పక్కకి తిరిగి నవ్వుకుంది. సుందరమ్మ చెల్లెలు వెంకట్రవణ పెళ్ళికెడుతోందని తెలిసి ఆవిడతో సాగనంపేరు చిట్టిపిల్లని. వెంకట్రవణకీ అనూరాధకీ అంతా అయిదేళ్ళె మాటలు లేవు. అయినా ఆవిడ ఊరుకోలేక మరోసారి సుబ్బారావుని కదిపిచూసింది.

'పదిహేనేళ్ళ చిట్టిపిల్లకి పద్దెనిమిదేళ్ళ శరీరమైతే వచ్చిపడిందిగాని, పన్నెండేళ్ళ లోకజ్ఞానమైనా లేదురా అన్నయ్యా! దాన్ని చూస్తే అక్కయ్య జ్ఞాపకానికి వచ్చి నా గుండె తరుక్కుపోతుంది అక్కడ చూస్తే దాన్ని సవిత్తల్లి రాని రంపాన పెడుతోంది. బావ చూస్తే దీని సంగ తేం పట్టించుకోడు. మనం వద్దను కుంటే మాత్రం వాళ్ళ అభిమానాలు ఎక్కడికి పోతాయిరా అన్నయ్యా మాతో దాన్ని తీసుకొచ్చేదాకా కాల్చుకుతినేసింది. ఎన్ని వేళాకోళాలు చేసి ఎంతగా వెక్కిరించినా మీ బుచ్చి కూడాకూడా కుక్కలా తిరుగుతోంది బావతో మాట్లాడి నువ్వు కోరిన కట్నం యిప్పిస్తాను నేను. ఆఖరుసారి అడుగు తున్నాను. మరొకసారి వదినతో ఆలోచించు... సొంత మేనగోడలు ..దాన్ని అన్యాయం చెయ్యకండి.'

అట్టే ఆలస్యం చెయ్యకుండా సుబ్బారావు జవాబు చెప్పేశాడు:


మా సేఫ్ డిపాజిట్ లాకర్స్‌లో

మీ విలువగల వస్తువులకు ఎక్కువ రక్షణ

స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ యొక్క రక్షణగల డిపాజిట్ లాకర్స్‌లో ఉంచండి.

యీ లాకర్‌కి ఒకే ఒక్క తాళంచెవి ఉంటుందని, అది మీవద్దనే ఉంటుందని జ్ఞాపకం ఉంచుకోండి.

మీ విలువగల వస్తువులు రహస్యంగానూ, భద్రంగానూ ఉండేది ఖాయం.

పి. సీతాపతిరావు, జనరల్ మానేజర్,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్.

"GEMINI"

'దానికి నువ్వింతదూరం చెప్పాలిటే చిన్నచెల్లాయ్! సుందరమ్మ కడుపుని ఒక కొడుకే పుడితే యీపాటికి ఎగిరి గంతేసి మా రాజ్యానికి చేసుకుని ఉండనూ? మనలో యీ ఎదురు మేనరికాలు ఒప్పుకోరుగద కర్మ!'

'ఆఁ, చాల్లెద్దూ – వదిన మాటని నువ్వు కాదనలేనని చెప్పకూడదూ?'.

చెల్లెలి రిమార్కుని విననట్టు నటించి పందిట్లోకి తప్పుకున్నాడు సుబ్బారావు. వెంకట్రవణ ఆ కోపమంతా యిటువైపు చూపించింది.

'ఏమేవ్ చిట్టిపిల్లా... మనం తక్కువ వాళ్ళకంటే ఎందులో ఏ విధంగా తీసిపోయినా, యింకా పూర్తిగా సిగ్గూ లజ్జా చచ్చిపోయి లేము. ఆ వెకిలి మనుషుల వెనక వెర్రిపడి తిరక్కు. వచ్చినదానిని స్వేచ్ఛగా రానియ్యక మీ బాబు నాకు నీ లంపటం కూడా తగిలించాడు. కర్మ గాలి నిన్ను క్షేమంగా యింటికి దిగబెట్ట వలసిన పూంచీ నాకు తగులడింది. ఒసేవ్, వింటున్నావా?'

వినడానికి ఏదీ అక్కడ చిట్టిపిల్ల?

ఆమె ఒంటి రంగుకీ, ఆమె రాసుకున్న అరంగుళం మందం పౌడరు పూతకీ ఎక్కడా రాజీ కుదరలేదు. తేనెరంగు ఆమె తలకట్టుకీ, పెట్టుకున్న నల్లని జోడా సవరాలకీ పొత్తు కుదరలేదు. ఆమె నడుము కొలతకీ, కట్టుకున్న టెర్లిన్ చీర చంచల స్వభావానికీ ఎక్కడా నప్పలేదు. అయితేనేం, రంయ్ రంయ్ మని, ఘల్ ఘల్ మని బుచ్చివైపు పరుగు తీసింది.


'చచ్చాంరా భగవంతుడా!' అని ఎవరేనా అనుకున్నారేమో గాని, బుచ్చి మాత్రం అనుకోలేదు. వాడూ, రాజ్యం, మరో యిద్దరూ కలిసి సెట్లు, పేకాట ఆడుతున్నారు.

'నీ ముక్కలు నేను పట్టుకోవద్దా బుచ్చిబావా!' అని చిట్టిపిల్ల కోరిన వరం వాడు వెంటనే యిచ్చేశాడు. తనని కసిరికొట్టనిది ఆ యింట్లో వాడొక్కడే అని దాని నమ్మకం.

ఆయాస పడుతున్నట్టున్నారు, విసరనా అత్తయ్యా!' అని అనురాధ దగ్గిరకి వెడితే;

'అతి ప్రయత్నంమీద గాని అడుగు తీసి అడుగు వెయ్యలేకుండా ఉన్నావు. నిన్ను చూస్తే లేనివాళ్ళకు కూడా ఆయాసం వస్తుందే అమ్మాయీ!' అని మూతి ముడుస్తుంది ఆవిడ.

'నీదే బారెడు జడ! అది దువ్వుకుని యింకొకరికి దువ్వడానికి టైం కూడా ఉంటుందా చిట్టీ!' అని పకపక నవ్వుతుంది అది. బుచ్చిబావ కూడా ఎప్పుడూ ఏదో ఒకటి అంటూనే ఉంటాడు. అన్నా కూడా ఎందుచేతో గాని చిట్టిపిల్లకి ఏమీ తప్పనిపించదు. పైగా బావ పక్కని ఉండగా అనుకోకుండానే దాని కళ్ళల్లోకి చిన్న మెరుపూ, దాని పెదవుల మీదికి చిరునవ్వూ చక్కావచ్చేవి.



'ఒరే అన్నయ్యా! తనంత అందగత్తె లేదని కాబోలు యీ చిట్టిపిల్ల వేసే పగటి వేషాలు చూళ్ళేకుండా ఉన్నాం. నీ కేదో సరదాగా ఉందేమోగాని, కూడాకూడా తిరిగితే మా తల కొట్టేసినట్టు అవుతోంది. మళ్ళీ మొహం ఎత్తకుండా దీని కెలా బుద్ధి చెబుతావో ఏమిటో!' అనే చెల్లెలి మాటలకి—

'పాపం, అదేం చేసిందే! కాణీ ఖర్చు లేకుండా కడుపుబ్బే నవ్వు ప్రసాదిస్తోంది. అయినా నీకు మరీ అంత వెక్కసంగా ఉంటే ఏదో ఒక దారి చూడకపోను,' అన్నాడు బుచ్చి.

ఆనాటినుంచే - ఆనాటి నుంచే ఏమిటి - ఆ క్షణం నుంచే అసలైన అల్లరి ఆరంభించాడు.

ఆ మధ్యాహ్నం ఒంటిగంటకి భోజనాలకి పిలిస్తే, ఆ మాట అందరికీ చెప్పి పంపించి, రాజ్యం మూలగదిలోకి వచ్చి, అక్కడున్న చిట్టిపిల్ల తీరు చూసి నవ్వు ఆగక, ఎలాగో దాచుకుని -

'ఒరే రే అన్నయ్యా! గబుక్కు నిలారా' అని బుచ్చిని పట్టుకొచ్చింది. అంత హడావిడిలోనూ పట్టపగలు ఒళ్లు తెలియకుండా పడక్కుర్చీకి జారబడి చిట్టిపిల్ల నిద్రపోతోంది! అయితే బుచ్చిని ఆకర్షించింది అదేం కాదు. చిట్టిపిల్ల నుదుటన నిలువుగా సన్నగా రేఖలా ఉన్నబొట్టు. ఆ మధ్య ఏదో సినిమాలో ఏభై యేళ్ళు దాటినా, పదహారేళ్లు దాటని పాత్రలు మాత్రమే ధరించే ఒక తారామణి అలాంటిబొట్టు మొదటిసారిగా పెట్టుకుంది. అంతటి ఆదర్శాన్ని ఆంధ్రనారీలోకం ఎలా కాదన గలదు! దాన్తో గుండ్రనిబొట్టు పని గుండుసున్నా అయి, నిలువుబొట్లు నిలబడిపోయాయి. ఆ బొట్టు ఇక్కడా ప్రత్యక్షమయేసరికి బుచ్చికి మండిపోయింది.

'చిన్న తమాషా చేస్తాను. భోజనానికి కూర్చోనివాళ్ళు యింకా ఉంటారు వాళ్ళందర్నీ యిటువైపు కేకేసుకునిరా' అని చెల్లెలికి పురమాయించి - సుద్దముక్క ఒకటి అరగదీసి, చిట్టిపిల్ల లేవకుండా అతిచాకచక్యం ప్రదర్శించి, ఆ ఎర్రనిగీతకు అటూ యిటూ తెల్లని వెడల్పైన పట్టీనామాలు దిద్దేశాడు. బుచ్చి ఇవతలికి వచ్చి తలుపు గడియవేసి అక్కడ నిలబడేసరికి పది పది హేనుమంది పిల్లలూ పెద్దలూ వేడుక చూడవచ్చారు.

'ఉష్, గొడవ చెయ్యకండి. 'వైష్ణవ జనతో' అనేపాట గాంధీగారికి చాలా ఇష్టంట. ఎందుకో తెలుసా? వైష్ణవుడంటే ఎవరు? అని అందులో ఉందిట. ఇప్పుడు నేను అసలైన వైష్ణవి ఎవరో మీకు చూపిస్తున్నాను. అల్లరి చెయ్యకుండా చూడండి.'

బుచ్చి నెమ్మదిగా గడియ తీశాడు. తిరుపతి వెంకటేశ్వరుణ్ణి మించిన పట్టెవర్ధనాలుగల చిట్టిపిల్లను చూసి అందరూ యిల్లు ఎగరగొట్టేశారు. అప్పటికి దానికి తెలివొచ్చింది. ఎదురుగుండా తనని వేళా

ఫోన్: 42626

అందరికీ దీపావళి శుభాకాంక్షలు!

✻ ఆంధ్ర రాజధానిలో
✻ ఆంధ్ర ప్రజల ఆదరాభిమానములతో
ప్రఖ్యాతి గాంచిన

రవీంద్ర హోటల్

(బోర్డింగ్ అండ్ లాడ్జింగ్)

ఆబిద్ రోడ్, హైదరాబాద్

రుచికరమైన మాంసాహార, శాకాహార భోజనము - విశ్రాంతికి పరిశుభ్రమైన గాలి వచ్చు గదులు

అన్ని ఆఫీసులకు, వ్యాపార సంస్థలకు అతి దగ్గర

మర్యాద మన్ననలకు ప్రసిద్ధి గాంచిన మీ రవీంద్ర హోటల్

కోళం చేస్తున్న అందర్నీ ఒకసారి చూస్తూంటే అప్పుడే నిద్ర లేచినదానికి గాభరా అనిపించినా – కూడా ఉన్న బుచ్చిని చూడగానే దానికి పోయిన ప్రాణం లేచివచ్చింది. ఎవరో అద్దం యిచ్చారు చూసుకోమని. ఒక్కమారు అందులో తన నుదుట్నీ, పక్కనున్న బుచ్చినీ చూసి లేచి గబగబా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది. వెంటనే మొహం కడుక్కడాని క్కాబోలు అని కొందరు అనుకున్నారు. బుచ్చి చేసిన పని అందరికీ చూపించి చివాట్లు పెట్టిస్తుంది కాబోలు అని మరికొందరు అనుకున్నారు. కాని దాని హడావిడి వేరు. బుచ్చి పెట్టిన బొట్టు చెరిగిపోకుండా ఏదైనా చెయ్యాలి. విడిదిలో ఎవరిదగ్గిరో కెమేరా ఉందిట తల వంచుకుని గబగబా అటువైపు అడుగేసింది చిట్టిపిల్ల.

'నీ కేమైనా బుద్ధుందీ?' అని చివాట్లు పెట్టేడు అన్నీ విన్న ప్రకాశంమావయ్య.

'అదేమిటి మావయ్యా! అందరికంటె 'సెన్స్ ఆఫ్ హ్యూమర్' ఉన్నవాడవి అనుకున్నాను... ఈసారి యిలా తగులుకున్నా వేమిటి నన్ను?' అన్న బుచ్చి జవాబు చెప్పేడు చిరాకుగా ...

"ఇదిట్రా సెన్స్ ఆఫ్ హ్యూమర్? మళ్ళీ ఇంగ్లీషుకావ్యాలు వెలిగిస్తున్నావ్ – ఆమాత్రం ఆ మాటకి అర్థం తెలీదూ? దాని అభిమానాన్నీ, అమాయకత్వాన్నీ ఆసరా చేసుకుని ఇష్టమొచ్చినట్టు ఏడిపిస్తావా?'

'అదేం ఏడ్చుకున్నట్టు లేదే, మధ్యని నీ కెందుకూ?'

ప్రకాశం మామయ్య ఎదురుగా నిలబడి మాటాడలేక, బుచ్చి అటువైపు తిరిగి ఆ మాట అన్నాడు. ఎలాంటి జవాబు వస్తుందో అని భయపడుతూనే ఉన్నాడు. జవాబు మాటలరూపంలో రాని మాట నిజమే – వీపు మార్మోగిపోయేంత గుద్దు మాత్రం పడింది!

అమ్మో! అని మెలికలు తిరిగిపోతూ– 'ఏమిటి మావయ్యా నువ్వు చేసిన పనీ?' అన్నాడు బుచ్చి హీనస్వరంతో.

'నువ్వు చేసిన పనికంటె ఎక్కువైందేం కాదు. అన్నెం పున్నెం ఎరగన్ది అది. అమ్మా నాన్నా అభిమానం తెలియన్ది అది. అది తప్ప నీకు ఆడించడానికి మరి ఎవరూ దొరకలేదా? ఏ వెకిలివేషాలు వేసినా మనసు ఉన్నవాడికే మోనని పొరపాటు పడ్డాను. నీ లాంటి వెధవకి మంచి కూడా ఏమిటి!'

ప్రకాశం వెళ్ళిపోయినా అతని మాటలు బుచ్చిని వదల్లేదు.

'బాబూ! మా క్లాసుకి రాకు. మా క్లాసులో కూచోకపోతే క్లాసుకి ఇంతని నీకు యిచ్చుకుంటాము' అని లెక్చరర్లు సైతం బుచ్చిని బతిమాలుకునే మాట నిజమే. అయితే ఒకర్ని ఏడిపించడం కోసమేనా తన జన్మ! తను చేసిన మంచి పనులే లేవా? బుచ్చి మనసులో రాయి పడింది. మడతమంచం మీద వెల్లకిలా




"జీవన్ టోన్"

రిజిస్టర్డు నంబరు 218726

TRADE MARK

శరీరంలోని కండరాలనూ రక్తకణాలనూ ఆయుర్వేద ఔషధాలు వృద్ధిచేయలేవా?–లేవు అని కొందరనుకుంటారు. ఇది నిరాధారమైన దురభిప్రాయం. దీన్ని తొలగించేదే జీవన్ టోన్. జీవన్ టోన్: అద్భుతమైన టానిక్కు. శక్తివంతమై ధాతువులను, కండరాలను, రక్తకణాలను అతి త్వరితంగా వృద్ధిచేయుటవల్ల కొద్ది వారాల్లోనే మీ బరువు పెరుగుతుంది. బలిష్ఠంగా ఉన్నవారి శరీరసౌష్ఠవాన్ని ఇంకా పెంపొందిస్తుంది.

జీవన్ టోన్ సేవనవల్ల బరువు తగుమాత్రం వృద్ధి కాగానే పుచ్చుకోవటం మానివేయవచ్చు. ఇది శరీరంలో కండరాలతోపాటు కొవ్వుకూడా వృద్ధిచేస్తుంది; కనుక, స్థూలకాయులు దీనిని సేవించకూడదు. ఎందుచేతనంటే–విపరీతమైన కొవ్వుతో శరీరం వికారంగా తయారవుతుంది. జీవన్ టోన్ సేవిస్తున్నంతకాలమూ శరీర వ్యాయామం అత్యంత అవసరం. దీనివల్ల చక్కని ఆకృతి ఏర్పడుతుంది. జీవన్ టోన్ బాలింతలకు కల్పతరువువంటిది. ప్రసవించిన తరువాత పూర్వపు శక్తిని పుంజుకోవటంలో ఇది ఎంతగానో తోడ్పడుతుంది. దీనికి పత్యం లేదు.

450 గ్రాం. వెల రు. 10-00 [తపాలా ఖర్చులు రు 3/- అదనం]

జ్యోతి హాస్పిటల్ [పోస్టు బాక్సు నం. 1413]

28, నార్త్ బోగ్ రోడ్డు, మద్రాసు - 17

నిలయ వైద్యులు: డాక్టర్ దామోదరన్, M. A. I. A. D. S. (Regd.)

పడుకుని వేరుసెనగపప్పులు విసిరి నోటితో అందుకుంటున్నాడే గాని - ఆ పనిలో మునపటంత ఉత్సాహం లేదు. ఏవేవో జరిగిపోయినవి తలపుకొస్తున్నాయి; ప్రశ్నిస్తున్నాయి.

## 5

ఆనాడు బుచ్చీ ఫ్రండ్సూ కలిసి సైకిళ్ల మీద అలా వెడుతున్నారు.

'ఎవరదీ? బుచ్చిబాబేనా? కాస్త ఆగ వయ్యా చిన్న పనుందీ!'.

బుచ్చి ఆగలేదు గాని సైకిలు బాగా స్లో చేశాడు.

'బాబ్బాబూ, యీ ఉత్తరం కొంచెం స్టేషనులో పడేసి వెడుదూ ... ఊళ్ళో టైము దాటిపోయిందీ ... మళ్ళీ రేపు శెలవా, మూడ్రోజులకి గాని అందదు ... చాలా అర్జంటువ్యవహారం బుచ్చీ!'

అన్నాడు ముసలాయన నడవలేక నడవలేక అడుగులు వేస్తూ ...

బుచ్చి ఆ కవరు అందుకున్నట్టే నటించి,

'నాకు టైం లేదండీ' అంటూ మిగిలిన వాళ్ళతో కలిసిపోయాడు నవ్వుకుంటూ.

'ఎవర్రా అతనూ?' అని వాళ్ళు అడిగేరు.


'మా నాన్నదగ్గిర ఒకప్పుడు పని చేసేవాడు.'

'ఏమోలే, అంత చనువుగా పిలిస్తే మీ కాబోయే మావగారేమో అనుకున్నాం. ఆ చింకి కోటూ, ఆ వైరు జోళ్ళూ చూస్తే చాలా ఆస్తి ఉన్నవాడులా ఉందే!'

'ఆఁ, ఆస్తి లేకేం, ఉంటుంది సుమారు వీశాపదలం!'

అన్నాడు బుచ్చి. అందరూ గొల్లున నవ్వేరు. ఏమిటీ తన హాస్యమే తనకు అప హాస్యంగా తోచింది. ముసలివాడు, హెర్నియాతో బాధపడుతున్న బీదవాడు. ఆమాత్రం సహాయం చేస్తేం తప్పేం?

'మీరు వెళ్ళి టిక్కెట్లు తీసుకోండిరా.




నాకు చిన్న పనుంది. అది చూసుకుని సినిమాహాలు దగ్గిర కలుస్తాను' అని వెనక్కి వచ్చి ముసలాయన ఉత్తరం అందుకుని స్టేషన్ వైపు సైకిలు తొక్కేడు బుచ్చి.

తను అంతదూరం స్టేషనుకి వెళ్ళి తిరిగి సినిమాహాలు చేరుకునేసరికి ఒక్క వెధవా తనకి కనపడి చావలేదు. అంతటి సినిమా పిచ్చి ఉన్న తన కేమో గాని అది మిస్ అయాననే బాధే కలగలేదు! పైగా ఏదో తృప్తికూడా కలిగింది!

మరోసారి తను రెండేళ్ళ కిందట హాస్టల్లో ఉన్నప్పుడు - పనిమనిషి కొడుక్కి పిచ్చికుక్క కరిచింది. అది ఏడుస్తూ వచ్చి పడింది.

'బాబ్బాబు ... గుంటడు పిచ్చికేకలు పెడుతున్నాడు. నా కేమిటో భయంగా ఉంది. అసలు అది పిచ్చిదో కాదో గదిలో పెట్టి చూడాలిటగా ... నర్సమ్మ కూతురికి కరిచినప్పుడు అలాగే చేశారు. కుక్క పారిపోతుంది. ఎవరైనా వెంటనే రండి బాబుల్లారా!' అని గోలపెట్టింది.

'నీ మొగుడికి అంతో ఇంతో పిచ్చి ఉన్న దని నువ్వే చెప్పేవుగా? పైగా తాగుతాడు కూడాను. వాడే ముద్దు ఎక్కువై కొడుకుని కరిచిఉంటాడు?' బుచ్చి వ్యాఖ్యకి అందరూ విరగబడి నవ్వేరు.

'తర్వాత కబుర్లు చెప్పుకోవచ్చు - ఆడ కూతుర్ని, ఒంటిదాన్ని ... నాయనా్నా యన! ఎవరైనా వచ్చి కుక్కని పట్టుకోరూ?'

ఎవరూ కదల్లేదు - పైగా ఒకరు రిమార్కు కూడా పాస్ చేశారు.

'చూసిచూసి పిచ్చికుక్కని ఎవరు పట్టుకుంటా రమ్మా - మాకు మాత్రం కరుస్తుందని భయం ఉండదూ? అంత పిచ్చి వాళ్లు ఎవ రుంటారూ?'

'నేను!' అని బుచ్చి ఒక కర్రా తువ్వాలూ పట్టుకుని సిద్ధమైపోయాడు.

'నా బాబే, మా నాయనే!' అని పని మనిషి కళ్ళు తుడుచుకుని కూడా పరి గెత్తింది. బుచ్చి ధైర్యం చూసి మరో కుర్రాడూ, తోటమాలీ కలిశారు. అందరు కలిసి కుక్కని షెడ్‌లోకి తరిమి గడియ వేశారు. అయిదోనాడు అది చచ్చి, తన పిచ్చి లోకానికి వెళ్ళడి చేసింది. బుచ్చి వెంటనే హాస్టలు డాక్టరుకి కబురుచేసి పనిమనిషి కొడుకుని చూపించాడు. డబ్బు పోగుచేసి వాడికి తిరుగుడు ఇంజక్షన్ల ఇప్పించి బాగుచేయించాడు; బతుక ఇచ్చాడు.

'నీ రుణం తీర్చుకోలేను బుచ్చిబాబ గారోయ్' అని పనిమనిషి గారాల మొదలుపెట్టింది - వాడి రెండు చేతులు పట్టుకుని.

'పీకలమీదకి వచ్చినా, కులాసాగా ఉన్నా, ఎప్పుడూ నీకు చేతనయింది రాగాలు పెట్టడమే నేమిటీ ?' అని బుచ్చిబాబు నవ్వబోయాడు. ఎందుకో వాడి కంఠం గద్గదికమైంది. దానికే కాదు వాడికీ కన్నీళ్ళు తిరిగేయి. హాస్యానికీ కరుణా రసానికీ యింతదగ్గిర చుట్టరిక ముందా!

మొగా ఆడా కలసి పెళ్లివారందరూ పిలుపులికి బయల్దేరేరు. తనుకూడా వస్తేగాని వల్లకాదని కూచున్నారు. ఎవరికో ఏదో కొత్తపేరు పెట్టోచ్చు. వ్యంగ్యంతో కూడిన విసుర్లు విసరి నలుగుర్నీ నవ్వించొచ్చు-మరొకప్పుడయితే బుచ్చి వెంటనే బయలుదేరేవాడే. కాని ప్రకాశం మావయ్య మాటలతో వాడి మనసు నలిగి ఉంది. తల నొప్పిగా ఉందని వంకబెట్టి ఆ మడతమంచానికి అంటుకుపోయాడు. పెళ్లి యింకో రోజుంది. వెంటనే బెడ్డింగు సర్దుకుని వెళ్ళిపోతేనేం ? 'నే నేం తప్పుపని చేశానని అంతమాటన్నావ్ ప్రకాశం మావయ్యా!' అనుకూంటూండగా వాడి కళ్ళల్లో నీళ్లు తిరిగేయి.

'తలనొప్పి అంత ఎక్కువగా ఉందా బుచ్చిబావా!' అంటూ చిట్టిపిల్ల అక్కడ ప్రత్యక్ష మయింది.

'అదేమిటీ, నువ్వు పిలుపులికి వెళ్ళలేదూ ?' అన్నాడు బుచ్చి ఆశ్చర్యంగా.

'ఏమిటో నాకు వెళ్ళా లనిపించలేదు బావా...' అంది అది వెయ్యివంకర్లు తిరిగి.

'నీకు తలనొప్పి ఎలా ఉందీ ?'

'తగ్గిపోయిందిలే...'

'అవునుగాని బావా ... ఒక్కటి అడగనా ?'

బుచ్చి ఉలికిపడి లేచికూచుని దానివైపు చూశాడు.

'లొట్టియ - అంటే ఏమిటి బావా?'

బుచ్చి గుండెలు దడదడ కొట్టుకున్నాయి. కొంపతీసి ఆ పద్యం ఇది చూడలేదు గద ? ఇక దాన్ని హాస్యం చెయ్యకూడదని పావుగంట క్రితమే ఒట్టు పెట్టుకున్నాడు. ఆఖరికి హాస్యమే తనని హాస్యం చేస్తూందాయేం! తను రాసిన ఆ పద్యం. కనీసం ఆరుకాపీ లయినా తీసి అందరికీ పంచిపెడతానని రాజ్యం అంది. కొంప తీసి అలా జరిగిపోలేదుగద !

'చెప్పవేం బావా! నీకు తెలీకుండానే రాశావా ? ఈ పద్యం నువ్వే రాశావని రాజలక్ష్మివదిన చెప్పిందే!" అని ఓ కాగితము మడత విప్పి, బుచ్చిచేతి కిచ్చింది చిట్టిపిల్ల. ఆ పద్యం మళ్ళీ యిలా చదువుకున్నాడు బుచ్చి :

కట్టిన చీర కట్టనిది
కాటుక పిట్టది పుట్టురూపుతో
గుట్టుగ వెళ్ళబుచ్చనిది
కొంచెము పొట్టిది పట్టిచూడగా
పుట్టెడు ఆముదా లుడుకు
పోజులచిన్నది చిట్టిపిల్ల నో
లొట్టియలార చూచితిరె
రూపము మీ ప్రతి, మీ రెరుంగరే!


పాఠకులకు, మా శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు

అత్యున్నత శ్రేష్ఠ

డ్రై-క్లీనింగ్
డయింగ్
మరియు
డార్నింగ్
కొరకు

**A-1 Dyers & Dry-Cleaners**

*H. O. & Works:* Kingsway, Secunderabad - Phone : 74840
Nampalli — Marredpalli — Ameerpet - Phone : 34216
*Dist. Branches:* Hanmakonda — Warangal.

ఆ పద్యం రాయగలిగినందుకు అప్పు డెంతో మురిసిపోయాడు. ఇప్పు డెంత గానో నొచ్చుకున్నాడు.

'లొట్టియ అంటే ఒంటె. మహాకవి గురుజాడ ప్రయోగం. ఊరికే సరదాకి రాశాను. మరోలా అనుకోకే చిట్టీ!'

'బాగుంది బావా! నాతో కాకపోతే మ రెవరితో హాస్యాలాడుతావు నువ్వు?'

అలా అంటున్నప్పుడు ఏ మాత్రమూ కపటంలేని దాని కన్నుల్లో కాంతి చూసి నిర్ఘాంతపోయాడు బుచ్చి. అది ఒక గొంగళిపురుగు కాదనీ, దాన్ని చూడగానే అసహ్యించుకుని అక్కణ్ణుంచి పారిపోవలసిన అవసరం లేదనీ వాడికి తోచింది అప్పుడే, అంతే కాదు. అలా దానివైపు చూస్తూంటే అది తన చెల్లికంటె తల్లి కంటె ఏ విధంగా తక్కువో కూడా బోధపడలేదు. వాళ్ళకంటె అనాకారిది కావొచ్చు. కాని తనవాళ్ళకంటె అందమైనవాళ్ళు తనకి తెలుసు. వాళ్ళముందు అమ్మా, చెల్లీ దమ్మిడీకి మారరే! అదిగాక అందాన్ని అందల మెక్కిస్తే ఎక్కించ వచ్చునేమో గాని అనాకారివాళ్ళని అధఃపాతాళానికి తొక్కెయ్యవలసిన అవసరం లేదే! పైగా అలా కనపడేలా పౌడరు రాసుకోకూడదనీ, అంత తక్కువ తలకట్టుమీద రెండు జడలు బాగుండవనీ, అంత నల్లని రంగుమీద ముదురురంగు సిల్కులు వేసుకోకూడదనీ చెప్పడానికి తన చెల్లికైతే తన తల్లి ఉంది, దీని కెవరున్నారు?

'ఎవరో ఒకరు ఉండాలి తప్పదు – జరిగిన అన్యాయం చాలు' అనిపించింది బుచ్చిబాబుకి హఠాత్తుగా. ఈ నిర్భాగ్యురాలికి తోడెవ రుంటారు? ఎవరు, ఎవరు, ఎవరు?

'ఏమిటి బావా! ఎప్పుడూ లేన్ది నా వైపు అలా చూస్తున్నావ్?'

బుచ్చి సమాధానాలు దాని కళ్ళల్లోనే తెలుసుకుందా మన్నట్టు గబగబా నాలుగు ప్రశ్నలూ అడిగేశాడు.

'చిట్టీ, నే నంటే నీకు ఇష్టమా ఏమిటే?'

'తన్ని తగిలేసినా నే నంటే నీకు కోపం రాదుటే?'

'ఇంత అభిమానానికి నేను నీ కిచ్చింది ఏమిటే?'

'కొంపదీసి నన్నుగాని పెళ్లాడేస్తావా ఏమిటే?'

ఆఖరి మాటకు చిట్టిపిల్ల యింక అక్కడ నిలబడలేకపోయింది. రెండు చేతుల్తో మొహం కప్పుకుని అక్కణ్ణుంచి పారిపోయింది. ఎప్పుడూ బుచ్చి కూడాతిరిగే చిట్టిపిల్ల యింక వాడి కళ్ళ పడడమే గగనమైపోయింది!





బెంగాల్ ఎలెక్ట్రికల్ కంపెనీ, బెంగళూరు-3 & మదరాసు-17

# 6

శివరాం పెళ్ళి ముహూర్తం దగ్గిర పడింది. పందిరి కిటకిటలాడిపోతోంది. పురోహితుడు పళ్ళెంతో తెచ్చి అక్షింతలు పంచుతూ వుంటే బుచ్చికూడా కొంచెం తీసుకున్నాడు.

'తప్పు, నీకంటె పెద్దవాళ్ళ మీద వెయ్యకూడదు' అన్నాడు ప్రకాశం.

'తెలుసు. చిన్నవాళ్ళమీద వెయ్యొచ్చుగా!' అని, అందరూ అక్షింతలు వేసేటప్పుడు చిట్టిపిల్ల తలమీద సరిగ్గా పడేలా విసిరేశాడు బుచ్చి.

'ఇంకా దాన్ని ఏడిపించటంలో నీకు తనివి తీరలేదన్నమాట.'

'అక్కర్లేదు. ఇకముందు నన్ను ఏడిపించేది అదే.'

'అంటే !?'

'నిన్ననే మాకు ప్రధానం జరిగిపోయింది,' అన్నాడు బుచ్చి స్పష్టంగా.

'ఏమిట్రా అదీ, సరిగ్గా చెప్పు!' అని అడిగాడు ప్రకాశం తెల్లబోయి.

ఇంకా చెప్పడానికేముంది? దాన్ని పెళ్ళి చేసుకోడానికి నేను నిశ్చయించుకున్నాను మావయ్యా!'

'బాగుంది; నీ యిష్టమే! మీ అమ్మా వాళ్లూ ఒప్పుకోవద్దూ ?'

'మా అమ్మా వాళ్ళూ ఒప్పుకోవద్దు. ఒప్పుకోనేవద్దు. కాని వద్దంటే నేను ఒప్పుకోవద్దూ? వాళ్ళ క్ష్టమై చేశారా సరేసరి ... లేకపోతే...'

బుచ్చిని చూస్తూంటే ప్రకాశానికి ఎంతో ఆనంద మనిపించింది.

'ఇంత వెధవగా ని న్నెరుగుదును; ఎంతవాడ వయ్యావురా !'

'మనుషులు ఎప్పుడూ ఒకలాగే ఉండి పోతారా ఏమిటి మావయ్యా!'

'ఏ దొచ్చినా నీతో కష్టంలా ఉందే!

'అవును. ఆ మాట నిజమే. ఏడిపించే వాళ్ళ కే ఎప్పటికయినా నవ్వించడం తెలుస్తుంది!'

ప్రకాశం వెలిగిపోతున్న వాడికళ్ళవైపు వింతగా ప్రేమగా చూశాడు. బుచ్చి కళ్ళముందున్న దృశ్యం మాత్రం వేరు.

వాడి పేంటు జేబునిండా వేరుశనగ పలుకు లున్నాయి.

కొంచెం దూరంలో నోరు తెరుచుని చిట్టిపిల్ల నిలబడిఉంది.

దాని నోటిలో పడేలాగ బుచ్చి ఒకటి ఒకటీ పలుకులు విసురుతున్నాడు. పసి పిల్లలై, పరమాత్మలై ఇద్దరూ నవ్వు కుంటున్నారు.

మంత్రాలు మారుమోగుతున్నాయి

